దిన పత్రిక
తొలి సమయం
గురువారం । 7 । మే । 2026

## మెగా రైతు మేళాకు గంగారం నుంచి రైతుల భారీ తరలింపు





**తొలి సమయం కొత్తగూడ 06 మే 2026**

తెలంగాణ ప్రభుత్వం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా హనుమకొండలో జరుగుతున్న రాష్ట్ర స్థాయి మెగా రైతు మేళా సభకు గంగారం మండలం నుంచి రైతులు, సర్పంచులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు బస్సుల ద్వారా భారీగా తరలి వెళ్లారు. ఈ కార్యక్రమం మంత్రి సీతక్క గారి ఆదేశాల మేరకు గంగారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు జాడి వెంకటేశ్వర్లు గారి ఆధ్వర్యంలో తరలివెళ్లారు. ఈ సందర్భంగా జాడి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, ప్రజా ప్రభుత్వం రైతుల సంక్షేమాన్ని లక్ష్యంగా పెట్టుకుని అనేక పథకాలను అమలు చేస్తోందన్నారు. మెగా రైతు మేళా సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు మరియు మంత్రి సీతక్క గారు రైతుల అభివృద్ధి కోసం ప్రభుత్వం తీసుకుంటున్న కీలక నిర్ణయాలను వివరించనున్నారని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ఎప్పటికీ రైతు పక్షపాతి పార్టీగా నిలిచిందని, రైతులు ఆర్థికంగా, సామాజికంగా ఉన్నతంగా ఎదగాలంటే కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని ఆయన అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రైతులకు అండగా నిలుస్తుండటం పట్ల తనకు ఎంతో ఆనందంగా ఉందని పేర్కొన్నారు.

# బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

## అవగాహనతోనే సమాజానికి మేలు

**తొలి సమయం కొత్తగూడ 06 మే 2026గూడూరు:** బాల్యంలో వివాహం అనేక అనర్థాలకు దారి తీస్తుందని, బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని జిల్లా డిప్యూటీ మాస్ మీడియా అధికారి కొప్పు ప్రసాద్ పేర్కొన్నారు. మంగళవారం గూడూరు మండలం అయోధ్యాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహించిన 'ఆశా డే' కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై ఆయన ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దేశ చట్టాల ప్రకారం అమ్మాయిలకు 18 సంవత్సరాలు, అబ్బాయిలకు 21 సంవత్సరాలు పూర్తి అయిన తర్వాత మాత్రమే వివాహం జరగాలని స్పష్టం చేశారు. బాల్య వివాహాల వల్ల శారీరక, భావోద్వేగ, మానసిక సమస్యలు తీవ్రంగా ఎదురవుతాయని, చిన్న వయస్సులో గర్భధారణ ఆరోగ్యపరంగా ప్రమాదకరమని వివరించారు. సరైన వయస్సులో వివాహం జరగడం వల్ల మహిళలు శారీరక దృఢత్వాన్ని పొందడమే కాకుండా, ఆరోగ్యకరమైన గర్భధారణకు సిద్ధమవుతారని తెలిపారు. బాల్య వివాహాల నిషేధం మహిళల సాధికారతకు దోహదపడుతుందని, వారు ఉన్నత విద్యను అభ్యసించడానికి, జీవిత నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవడానికి, అలాగే సామాజిక, ఆర్థిక, రాజకీయ రంగాల్లో సంపూర్ణంగా పాల్గొనడానికి అవకాశం కల్పిస్తుందని ఆయన అన్నారు. కుటుంబ సభ్యులు, గ్రామ పెద్దలు, యువత కలిసి బాల్య వివాహాల నిర్మూలనలో చురుకుగా పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఆరోగ్య శాఖ సిబ్బంది గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ, బాల్య



వివాహాల వల్ల కలిగే దుష్పరిణామాలపై ప్రజలకు నిరంతరం చైతన్యం కల్పించాలని సూచించారు. ఆశా కార్యకర్తలు గ్రామస్థులకు చట్టపరమైన అంశాలు వివరించి, బాల్య వివాహాల నివారణలో ముందుండాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య విద్యా బోధకుడు పురుషోత్తమ్, ఎంపీహెచ్ఓలు కేఎల్ఎన్ స్వామి, గోపిచంద్, పీహెచ్ఎన్ మేరి, సూపర్వైజర్లు ఫహీముద్దీన్, గణేశ్, హేమలత, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమం ద్వారా బాల్య వివాహాల నిర్మూలనపై గ్రామస్థుల్లో చైతన్యం పెంపొందించేందుకు కీలక సందేశాలు అందించారు.